సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



మండుతున్న ఓసీపీలు

రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో సింగరేణి ఓసీపీలు మండుతున్నాయి. భానుడి భగభగతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పని వేళలు మార్చాలని కార్మికులు కోరుతున్నారు. 8లో▸



ఐక్యత చాటారు..

మంచిర్యాలలోని తెలంగాణ చౌరస్తాలో నిర్మించిన శివపంచాయతన క్షేత్రంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అందరూ ఐక్యతగా విరాళాలు అందజేసి నిర్మించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం

41.0 /29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల వ్యయ పరిశీలకుడిని కలిసిన కలెక్టర్



సమీర్ నైరంతర్యకు కలెక్టర్ స్వాగతం

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సమీర్ నైరంతర్యను కలెక్టర్ బి.సంతోష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యయ పరిశీలకులు నియామకం అయిన ఆయనను పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ అతిథి గృహంలో కలిసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిధిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో చేసే ఖర్చుల వివరాలను ఆయన పర్యవేక్షిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

26నుంచి సైన్స్ సమ్మర్ క్యాంపు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో సైన్స్ సమ్మర్ క్యాంపు నిర్వహణకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోగాత్మక సైన్స్ విద్య అమలు చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆలోచనలను మార్చడంతోపాటు ప్రేరేపించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. జిల్లా సైన్స్ సెంటర్‌లో విజ్ఞానశాస్త్రాలపై ఉచిత సైన్స్ శిక్షణ శిబిరాలు 15 రోజులపాటు జరుగనున్నాయి. ఈ నెల 26 నుంచి నిర్వహించే సైన్స్ సమ్మర్‌క్యాంపునకు 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పించారు. పాఠ్యపుస్తకాన్ని ప్రయోగాత్మకంగా, భయం నుంచి విశ్వాసానికి మార్చుటకు, సబ్జెక్టు నిపుణుల సెషన్‌లతోపాటు ప్రేరణాత్మక సెషన్‌లు, ఎలక్ట్రానిక్, రోబిటిక్ సెషన్‌లపై నేర్పించనున్నారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా సైన్స్ సెంటర్‌లో సైన్స్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య ప్రకటించారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలు ఈ నెల 22వరకు నమోదు చేసుకోవాలని, వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును 9849550200 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఆకెనపల్లిలో మాట్లాడుతున్న రాహుల్

తాండూర్/బెల్లంపల్లిరూరల్: ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు లోను కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం ఆయన తాండూర్ మండలం తాండూర్, రాజీవ్‌నగర్, కిష్టంపేట, బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్ల సౌకర్యార్థం ఆకెనపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న 36వ పోలింగ్ కేంద్రాన్ని నేతకానివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మార్చినట్లు తెలిపారు. స్థానికులతో మాట్లాడి అక్కడి స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, బెల్లంపల్లి తహసీల్దార్ కేవై.ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

భీమిని: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రోజు రోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామాల్లోని సబ్‌సెంటర్లకు వైద్య సిబ్బంది విధిగా హాజరు కావాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. వైద్యుడు కృష్ణ, హెచ్‌ఈవో నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్.. మత్తు నిర్లక్ష్యం..!

- గంజాయి నియంత్రణపై నిఘా కరువు
- పోలీసు దాడుల్లోనే ఎక్కువగా కేసులు నమోదు
- జిల్లాలో ఎక్సైజ్ విభాగం పనితీరుపై సర్వత్రా విమర్శలు

మంచిర్యాలక్రైం: గంజాయి సాగు, రవాణా, బెల్ట్ షాపులు, కల్తీ కల్లు, మద్యం కల్తీతోపాటు నార్కోటిక్ డ్రగ్స్‌ను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖను నిర్లక్ష్యపు మత్తు కమ్మేసింది. మద్యం అమ్మకాలు, ఆదాయంపైనే దృష్టి సారించి గంజాయిపై నియంత్రణను గాలికొదిలేసింది. డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సాగుపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఆదేశాలు జారీ చేశారు. అయినా జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడో ఒక చోట పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసులు నమోదు అవుతుండగా.. వీటి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. పట్టణం, పల్లె, గల్లీ తేడా లేకుండా కొందరు గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయసులో గంజాయి దమ్ము కొడుతూ మత్తులో రెచ్చిపోతున్నారు. మద్యం, గంజాయి మత్తులో అలజడులు చోటు చేసుకుంటున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. మద్యం దుకాణాలపై దృష్టి సారించి అమ్మకాలు పెంచి ఆదాయం రాబట్టడంలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.



గంజాయి సాగు చేసి పట్టుబడిన యువకుడితో పోలీసులు(ఫైల్)

జిల్లాలో పోలీసులు నమోదు చేసిన గంజాయి కేసులు

సంవత్సరం	కేసులు	అరెస్ట్	స్వాధీనం చేసుకున్న గంజాయి
2023	49	73	483.338 కిలోలు
2024 ఏప్రిల్ 18వరకు	19	28	8.676 కిలోలు

- ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం.

గంజాయి సాగు.. రవాణా

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కొందరు అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఇంటి ఆవరణలో పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. మరోవైపు పోలీసులు గంజాయి రవాణాను అడ్డుకుని కేసులు నమోదు చేస్తున్నారు. సాగు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ధ్వంసం చేయడం, కేసులు నమోదు చేసి జైలుకు తరలించడం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు దొరికిన గంజాయి విక్రేతలు, సేవించే వారిలో యువత, విద్యార్థులు ఉండడం గమనార్హం. మహారాష్ట్ర, ఒడిశా, మహబూబాబాద్ నుంచి గంజాయిని రైలు మార్గం గుండా రవాణా చేస్తున్నారు. వీటిపై నిఘా ఉంచి పట్టుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కేసులు నమోదైన సందర్భాలు లేవు. 'అప్‌డెక్ ప్రైస్' అంటే గత ఏడాది మార్చి వరకు వచ్చిన ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం పెంచుకోవడంపైనే దృష్టి సారించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు గంజాయి నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సరిపడా సిబ్బంది లేక..



సరిపడా సిబ్బంది లేకపోవడంతో గంజాయిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టలేక పోతున్నాం. పోలీసులకు రోజు ప్రజలతో ఎక్కువ సంబంధం ఉంటుంది. వారికి త్వరగా సమాచారం అందుతోంది. పోలీస్ ఫోర్స్ కొంచెం ఎక్కువగా ఉన్నందున తరచూ దాడులు నిర్వహిస్తుంటారు. ఎక్సైజ్ శాఖలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తాం. పోలీసుల సమన్వయంతో గంజాయి నియంత్రణకు కృషి చేస్తాం.

– కేజీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

పెట్రేగుతున్న మూకలు..!

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గంజాయి మత్తులో అల్లరి మూకలు పెట్రేగుతున్నాయి. స్పెషల్‌ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల శివారులు ప్రాంతాలు గంజాయి దమ్ము కొట్టేందుకు అడ్డాలుగా మారాయి. ఆయా ప్రాంతాలు సాయంత్రం కాగానే జన సందడి లేక నిర్మానుష్యంగా మారుతాయి. ఇక చీకటి పడితే ఒంటరిగా ఆ ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితులు ఉంటాయి. వారం రోజుల క్రితం కొందరు యువకులు గంజాయి మత్తులో కేరింతలు కొడుతూ హంగామా చేయడం కలకలం రేపింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాత్రిపూట ఇళ్ల పరిసరాల్లోకి వెళ్లి కేకలు వేస్తూ.. డ్యాన్స్‌లు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో నిద్ర నుంచి మేల్కొన్న కొందరు మహిళలు అభ్యంతరం చెప్పడంతో సదరు యువకులు తిరగబడి దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. 'మా ఇష్టం మీరేంది మాకు చెప్పేది.. మేము ఇలాగే వ్యవహరిస్తాం.. దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ దురుసగా మాట్లాడి కయ్యానికి కాలు దువ్వినట్లుగా ప్రచారం జరుగుతోంది. కన్నాలబస్తీ, టేకులబస్తీ యువకులు ఆ గుంపులో ఉన్నట్లుగా గుసగుసలు విని పిస్తున్నాయి. మరుసటి రోజు ఇందిరమ్మ కాలనీ మహిళలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డిని కలిసి విద్యార్థులు కళాశాల నుంచి రాత్రిపూట బయటకు రాకుండా చూడాలని సూచించడం సందేహాలకు తావిస్తోంది.

విద్యార్థులపై నిఘా

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై హెచ్చరికలు చేసినట్లుగా తెలుస్తోంది. కళాశాలకు సంబంధం లేని యువకులతో సహవాసాలు చేయొద్దని, రాత్రి పూట హాస్టల్ నుంచి బయటకు వెళ్లొద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఆకర్శితులు కావద్దని, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వివరించినట్లుగా తెలుస్తోంది. ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో కొందరు విద్యార్థులు గంజాయికి అలవాటు పడడంతో ఆ పరిస్థితులు పునరావృతం కాకుండా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కాగా, ఇందిరమ్మ కాలనీలో హంగామా చేసిన యువకుల్లో తమ విద్యార్థులు లేరని ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కొందరు విద్యార్థులు గంజాయికి అలవాటు పడి వెకిలి చేష్టలు చేయడంతో కళాశాల నుంచి సస్పెండ్ చేశామని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని తెలిపారు.

అప్రమత్తమైన పోలీసులు

యువకుల హంగామా ఘటన తర్వాత పోలీసులు అప్రమత్తం అయ్యారు. నిఘాతోపాటు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశారు. ఆ చర్యకు పాల్పడిన యువకుల కోసం ఆరా తీస్తూ తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలోనే కన్నాలబస్తీకి చెందిన దుర్గం రాజేష్ గుట్టుగా తన ఇంటి ఆవరణలో గంజాయిని పెంపకం చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని రాజేష్‌ను గత శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్: లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈ మేర కు ఒక ప్రకటన విడుదల చేశా రు. పెద్దపల్లి(ఎస్సీ) నియోజకవర్గ పరిధి జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సెలవులు మినహాయించి ఈ నెల 25వరకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవోలకు నామినేషన్లు సమర్పించవచ్చని పేర్కొన్నారు. 26న పెద్దపల్లి కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు ఈ నెల 29వరకు ఉంటుందని తెలిపా రు. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలి పారు. జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ ని యోజకవర్గాల్లో 227చొప్పున, మంచిర్యాలలో 287 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో గంట ముందే పోలింగ్ బంద్


సాక్షి ప్రతినిధి మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గంట ముందే ఓటింగ్‌ను అధికారులు నిలిపివేయనున్నారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్‌కు అనుమతి ఇస్తారు. ఇక పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం నియోజకవర్గాల్లో మాత్రం సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఈవీఎంలు, సిబ్బంది, తరలింపు, రవాణాకు చీకటి పడే వరకు చూడకుండా ముందు జాగ్రత్తగా భద్రతా కారణాలతో ఎన్నికల సంఘం ఈ ఏర్పాట్లు చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తీరుగా సమయం కేటాయించారు. నిర్ణీత సమయంలోపు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లు, క్యూలో ఉన్న వారికి తమ ఓటు హక్కు వినియోగించుకునే వరకు అవకాశం కల్పిస్తారు.

ఇంటర్ ప్ర'వేషాలు'..!

"హలో సార్.. మీ పాపను మా కాలేజీలో చేర్పించండి. ఐఐటీ, నిట్, నీట్ కోచింగ్ ఇస్తాం. నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు. మిగతా కాలేజీతో పోల్చితే తక్కువ ఫీజులు.. మంచి భోజనం.. ఒక్కసారి హైదరాబాద్‌కు వస్తే మా కాలేజీ చూడండి. వీలు కాదంటే మా ప్రతినిధి మీ ప్రాంతంలోనే ఉన్నారు. మిమ్మల్ని కలుస్తారు. కాలేజీ వివరాలు, రూట్‌మ్యాప్ పంపిస్తాం ఓసారి చూడండి.." అంటూ కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలు పీఆర్‌వోలు విద్యార్థుల తల్లిదండ్రులను గందరగోళంలోకి నెడుతున్నారు.

- విద్యార్థుల చేరికలపై యాజమాన్యాల పోటాపోటీ
- ఫోన్లు, పీఆర్వోల ద్వారా తల్లిదండ్రులకు ప్రలోభాలు
- కార్పొరేట్ కాలేజీల ఆన్‌లైన్ తరగతులు మరూ

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడక ముందే విద్యార్థులను ప్రైవేటు కాలేజీల్లో చేర్పించుకుంటున్నారు. ముందస్తు సీటు రిజర్వేషన్ పేరిట రూ.10వేలు వసూలు చేస్తున్నారు. హాస్టల్ వసతికి భారీగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో గ్రూపులో నిబంధనలకు విరుద్ధంగా 60 మందికి పైగా విద్యార్థులను కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం జూన్ ఒకటిన కళాశాల ప్రారంభించాలని ప్రభుత్వ చెబుతున్నా కొన్ని కార్పొరేట్ కళాశాలలు ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించి ఫీజులు రాబడుతున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అపార్టుమెంట్లలో కాలేజీల నిర్వహణ సాగుతున్నా అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. షెడ్యూల్ ప్రకటనకు ముందే ముందస్తు అడ్మిషన్లు ఇస్తున్న కాలేజీలపై చర్యలు తప్పవని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి హెచ్చరిస్తున్నా కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల తీరు మారడం లేదు.



ప్రైవేట్ కళాశాలలపై డీఐఈవో జారీ చేసిన లేఖ

మాయాజాలం..

ఇంటర్ ప్రవేశాలపై కళాశాలల యాజమాన్యాలు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి. అఫిలియేషన్(అనుమతి) లేకున్నా తమ కళాశాలలో చేరాలంటూ విద్యార్థులపై ప్రలోభాలు, ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్నాయి. జిల్లాలో 20 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. అఫిలియేషన్(కళాశాల గుర్తింపు) పొందాలంటే ఆట స్థలం, అగ్నిమాపక అనుమతులు, కాలుష్యం, భవన పటిష్టత, ట్రాఫిక్, తదితర ధ్రువీకరణ పత్రాలు అవసరం. బోధకులు, సిబ్బంది, వివరాలన్ని ఉంటేనే అనుబంధ గుర్తింపు లభిస్తాయి. కళాశాలల్లో అన్ని సౌకర్యాలుంటేనే అనుమతులు ఇస్తారు. ఇందులో ఏ ధ్రువీకరణ పత్రం లేకపోయినా అధికారులు గుర్తింపు సిఫారసు చేయరు. ఒకచోట బోధన చేస్తున్న అధ్యాపకులు, మరోచోట పనిచేయడానికి అవకాశం ఉండదు. అనుమతులు పొందిన వారే కళాశాలలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఫీజులు ఇలా..

కార్పొరేట్ కళాశాలల్లో గ్రూపులను బట్టి ఫీజులు నిర్ణయిస్తున్నారు. ఏసీ, సెమీ ఏసీల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి రూ.3లక్షలపైన వసూలు చేస్తున్నారు. రూ.2.30లక్షల నుంచి రూ.2.60లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తుండగా.. అదనంగా రూ.25వేల వరకు దోబీ, ఇతరత్రా అవసరాల పేరిట దండుకుంటున్నారు. నాన్ ఏసీకి రూ.1.90లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉన్నాయి. ఇంత ఫీజులు చెల్లిస్తున్నా విశాలమైన స్థలం లేకపోగా అపార్ట్‌మెంట్‌లో, ఇరుకు గదుల్లోనే తరగతులు కొనసాగిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల అనుమతులు ఉన్నాయో.. లేదో చూశాకే ప్రవేశం పొందాలి. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో పీఆర్‌వోల మాటలు నమ్మి అధిక ఫీజులు చెల్లించలేక ఇబ్బందులకు గురికాకూడదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల అడ్మిషన్లు చేస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్య పూర్తిగా ఉచితంగా ఉంటుంది. సమర్థవంతమైన, సుదీర్ఘ బోధన అనుభవం కలిగిన అధ్యాపకులు, రోజువారీగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, స్టడీ అవర్స్ నిర్వహణ ఉంటుంది.

– శైలజ, డీఐఈవో మంచిర్యాల

తొలిరోజు నలుగురు



ఆర్వో ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మహిపాల్, రాజ్‌కుమార్, నవీన్, తిరుపతి

- పెద్దపల్లిలో నామినేషన్లు వేసిన స్వతంత్ర అభ్యర్థులు
- నేడు కేటీఆర్ సమక్షంలో 'కొప్పుల' నామినేషన్
- గడ్డం వంశీకి మద్దతుగా మంత్రి, ఎమ్మెల్యేలు

సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో తొలి రోజు గురువారం పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ధర్మపురి నియోజకవర్గానికి చెందిన దూడ మహిపాల్, నూకల నవీన్, పెద్దపల్లికి చెందిన దుర్గం రాజ్‌కుమార్, అక్కపాక తిరుపతి స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. కాగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మంచిరోజు, ముహూర్తం చూసుకొని శుక్రవారం ఒక్కో సెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు ఈ నెల 25వరకు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ 28న చేసుకోవచ్చు. పోలింగ్ మే 13న, జూన్ 4 కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటించనున్నారు.

భారీ ర్యాలీతో 'కొప్పుల'..

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫాం అందుకున్న ఆ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పెద్దపల్లిలో నామినేషన్ వేయనున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు నియోజకవర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, నియోజకవర్గ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతుతో ఒక్క సెట్ నామినేషన్ వేయనున్నారు. చివరి రోజు భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నేడు ఒక్క సెట్ నామినేషన్ వేయనుండగా, ఈ నెల 24న కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మిగిలింది ఐదు రోజులే

ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్లు గురువారం నుంచి స్వీకరిస్తుండగా, నేడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో సెట్ నామినేషన్ వేయనున్నారు. మిగిలిన రోజులను చూస్తే అందులో 21వ తేదీ ఆదివారం సెలువురోజు తీసేస్తే ఐదురోజులు మాత్రమే రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందులో మంగళవారం చాలామందికి మంచిరోజు కాదన్న అభిప్రాయం ఉంటుంది. చివరి రెండు రోజులైన బుధ, గురువారం అభ్యర్థులు పెద్ద ఎత్తున జనసమీకరణ చేసి, భారీ ర్యాలీలతో మరో సెట్ నామినేషన్ వేసి బలప్రదర్శన చేసే అవకాశాలున్నాయి.



హైదరాబాద్‌లో కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ఎన్నికల అధికారులతో సమావేశం

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వి.రాములు, హరికృష్ణ, ప్రత్యేక ఉపపాలన అధికారి డి.చంద్రకళ, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, విద్యుత్, ఫ్యాన్లు, మూత్రశాలలు, పూర్తి సౌకర్యాలతోపాటు దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ర్యాంపు, వీల్‌చైర్స్ సదుపాయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రచారం కోసం ప్రకటనలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతరత్రా అంశాలపై సువిధ యాప్ ద్వారా అందే దరఖాస్తులకు నిర్ణీత సమయంలోగా అనుమతి జారీ చేయాలని అన్నారు. ఓటర్ స్లిప్పులు ప్రతీ ఇంటికి పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు.

పకడ్బందీగా ఓపెన్ ఇంటర్, టెన్త్ వార్షిక పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఈ నెల 25 నుంచి మే 2వరకు ఓపెన్ ఇంటర్, టెన్త్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శైలజ, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు 5 పరీక్ష కేంద్రాలు, 10వ తరగతి పరీక్షలకు 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 1,317 మంది, 10వ తరగతి పరీక్షలకు 659 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సీపీ బన్సీలాల్, జిల్లా ఖజానా, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, తపాలా, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల పోసు(68) ఆత్మహత్యకు పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధిపల్లి గ్రామానికి చెందిన పోసు భర్త చిన్నయ్యతో కలిసి కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు మల్లేశ్, లచ్చయ్య, కుమార్తె బానక్క ఉన్నారు. మూడేళ్లుగా పోసు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతోంది. చికిత్స తీసుకుంటున్నా ఆరోగ్య బాధ తాళలేక జీవితంపై విరక్తితో బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున చనిపోయింది. మృతురాలి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రతిపాదనలు

మంచిర్యాలటౌన్: అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ ప్రతిభ కలిగిన విద్యార్థిని, విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్/ఎంసెట్ ఉచిత విద్యకు జిల్లాలోని అర్హత గల ప్రైవేటు కళాశాలల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్/కరస్పాండెంట్లు తమ కళాశాల అనుమతి ధ్రువీకరణ పత్రం, సదుపాయాలు, బిల్డింగ్ ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత ఐదేళ్ల ఉత్తీర్ణత శాతం వివరాలు అందించాలని తెలిపారు. కోర్సుల వివరాలు, ప్రాథమిక సౌకర్యాలు, వసతి ధ్రువపత్రాలు జతపరిచి ఈ నెల 27లోగా ఈపాస్‌లో దరఖాస్తు చేసుకుని, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ప్రతి, ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

శ్రీరాంపూర్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కలిశారు. అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నీల బోయినకుమార్ తదితరులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణి కార్మికులకు ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని, రిజర్వేషన్ ప్రకారం ఖాళీలను పూర్తిగా భర్తీ చేయాలని తెలిపారు. యూనియన్ నాయకులు సురేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఓసీపీలు

- భానుడి భగభగతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- 44 డిగ్రీల వరకు నమోదు
- సతమతం అవుతున్న కార్మికులు
- క్వారీల్లో చలువ పందిళ్ల ఏర్పాటు
- షిఫ్ట్ వేళలు మార్చాలని డిమాండ్



మందమర్రి కేకే ఓసీపీలో వేసిన చలువ పందిరి



బెల్లంపల్లి ఖైరిగూడ ఓసీపీలో గొడుగులు పంపిణీ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో సింగరేణి ఓసీపీలు మండుతున్నాయి. భానుడి భగభగతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండలు ముదురడంతో ఓసీపీల్లో కార్మికులు వేడికి అల్లాడుతున్నారు. బెల్లంపల్లి రీజియన్‌లోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఉన్న ఐదు ఓసీపీల్లో 20 రోజుల క్రితం 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తరువాత ఒక్కసారిగా పెరిగాయి. ప్రస్తుతం రీజియన్‌లోని ఓసీపీల్లో సరాసరిగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. దీంతో కార్మికులు పని చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్నారు. సాధారణ ప్రాంతాలతో పోల్చితే కోల్‌మైనింగ్ ఉన్న చోట ఉష్ణోగ్రత రెండు మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతుంది. ఓసీపీల్లో నల్లని కోల్ అంతా ఎక్స్‌పోజ్ అయ్యి ఉండడం, దీనికి తోడు కొన్ని భూగర్భ గనులు ఓసీపీలుగా మార్చడం వల్ల పాత పని స్థలాలు బయటపడ్డప్పుడు కోల్‌ఆక్సిడేషన్ అయ్యి అక్కడక్కడ మంటలు రావడం జరుగుతుంది. దీంతో ఓసీపీ క్వారీల్లో వేడి అధికంగా నమోదు అవుతుంటుంది. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు డ్యూటీకి వచ్చి పోయేటప్పుడే తప్ప లోపలికి వెళ్లిన తరువాత ఏమాత్రం బయటి వాతావరణంతో సంబంధం ఉండదు. కానీ ఓసీపీల్లో కార్మికులంతా అరు బయట ఉండి పని చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వీరు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మండుతున్న ఎండలకు విధుల్లోకి వెళ్లిన కొద్ది సేపటికి యూనిఫాం పూర్తిగా చెమటతో తడిసిపోతోందని, ఒళ్లంతా వేడెక్కుతోందని కార్మికులు వాపోతున్నారు. ఉదయం 11 గంటలకే భానుడు ప్రతాపం చూపెడుతున్నాడని పేర్కొంటున్నారు. కొన్ని ఓసీపీల్లో పని స్థలాల వద్ద అక్కడక్కడ రెస్టు షెల్టర్లు ఉన్నా ఏమాత్రం ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. ఉదయం షిఫ్ట్ ఉద్యోగుల కంటే సెకండ్ షిఫ్ట్ ఉద్యోగులు అధికంగా ఎండ తీవ్రతకు గురవుతున్నారు. ప్రతీ వేసవిలో కంపెనీ ఉపశమన చర్యలు చేపడుతుంది. ఈసారి ముందే ఎండలు మండుతున్నందున యాజమాన్యం వేసవి ఉపశమన చర్యలు మరిన్ని చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత పెరిగితే కార్మికుల హాజరు శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

పని వేళలతో పరేషాన్..

ప్రస్తుత పనివేళలతో వేసవిలో ఉద్యోగులు పరేషాన్ అవుతున్నారు. ఓసీపీల్లో ఎండ తీవ్రత దృష్ట్యా షిఫ్ట్ వేళలు మార్చాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఫస్ట్‌షిఫ్ట్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెకండ్ షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుంది. ప్రతీ వేసవిలో ఎండల తీవ్రత పెరిగితే షిఫ్ట్ వేళలను కంపెనీ మార్చుతుంది. ఉదయం షిఫ్టును ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సెకండ్ షిఫ్టును సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12గంటలకు మార్చుతారు. ఈ వేళలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను కంపెనీ పంపిణీ చేస్తుంది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో మూడు రోజుల నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నా మజ్జిగ ఆదివారం నుంచే ఇస్తున్నారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ, మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీ, ఆర్కేపీ ఓసీపీల్లో కూడా వీటిని పంపిణీ చేస్తున్నారు. కైరిగూడ ఓసీపీలో ఉద్యోగులకు గొడుగులు, కూల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు క్వారీలో వేసిన చలువ పందిళ్లు సరిపోవని, మరిన్ని చలువ పందిళ్లు తాము పని చేసే చోట సమీపంలోనే ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. అన్ని డంపర్లు, షవల్స్‌లో ఏసీలు ఫుల్ కండీషన్ చేయాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులవి ప్రాణాలు కావా...?

ఓసీపీలు, ఇతర ఉపరితల డిపార్టుమెంట్లలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం పట్టించుకోవడం లేదు. వారికి కూడా పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్నట్లుగా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఓసీపీల్లో చాలామంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వారు కూడా ఎండవేడితో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. తమవి కూడా ప్రాణాలేనని వారు వాపోతున్నారు. తమకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

తక్షణమే వేళలు మార్చాలి

ఓసీపీల్లో షిఫ్ట్ వేళలను తక్షణమే మార్చాలి. ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. దీనిపై కార్పొరేట్ అధికారులు నిర్ణయం తీసుకొని ఏరియాలకు ఆదేశాలివ్వాలి. ఓసీపీ ఇతర సర్ఫేస్ డిపార్టుమెంట్లలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి. –ఎస్కే బాజీసైదా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు బహిరంగ లేఖ రాశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద మంత్రి సీతక్క పేరు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణానికి చెందిన ఒక మహిళా వైద్యురాలిని బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేశారన్నారు. లోకసభ ఎన్నికల ఫండ్ పేరిట, సీతక్కకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్‌లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క పేరును వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు గోలెం వెంకటేశ్, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా దళిత మోర్చా నాయకులు ఈర్ల విశ్వేశ్వర్, కొప్పుల శంకర్, సత్పుతె తుకారాం, పవన్ పురోహిత్, మామిడి బాలాజీ, మోహన్, భీమేశ్, జనార్దన్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కాగజ్‌నగర్‌రూరల్: అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ గురువారం పట్టణ సీఐకి ఫిర్యాదు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరు చెప్పి మహిళా వైద్యురాలిని బెదిరించి ఎన్నికల ఫండ్ పేరిట రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేసినట్లు అసత్యపు ఆరోపణలు చేశారన్నారు. తనను అవమానపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడి



సోదా చేస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలో అక్రమ వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై గురువారం డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో మూడు టీంలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. పెద్దవాగు రోడ్డులోని సురేందర్ సితాని ఇంట్లో ప్రామిసరీనోట్లు, నాన్‌జ్యూడిషియల్ బాండ్లు, నాలుగు బ్లాంక్ చెక్కులతో పాటు రూ.1,43,250 నగదు, దుర్గానగర్‌లోని జుగల్ కిశోర్‌లోయా ఇంట్లో రూ.28 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు. అమాయక ప్రజల నుంచి అధికశాతం వడ్డీ వసూలు చేస్తూ వారిని వేధిస్తుండటంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అడవిలో నిప్పు పర్యావరణానికి ముప్పు



సిబ్బందితో మంటలను ఆర్పిస్తున్న ఎఫ్‌డీఓ

వేమనపల్లి: అడవిలో అగ్గి రాజుకుంటే పర్యావరణం, వన్యప్రాణులు, మానవ మనుగడకు ముప్పు అని బెల్లంపల్లి ఎఫ్‌డీఓ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం వేమనపల్లి అటవీ బీట్ 428 కంపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగగా సిబ్బందితో కలిసి దగ్గరుండి మంటలను ఆర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాల ప్రజలు అడవుల్లో నిప్పు పెట్టకూడదని హెచ్చరించారు. ఇప్ప పువ్వు, చీపురు సేకరణ అటవీ ఫలాల కోసం వెళ్లే వారు నిప్పు పెట్టవద్దని అన్నారు. అడవుల్లో నిప్పు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం దస్నాపూర్, కొత్తపల్లి, వేమనపల్లి బీట్‌లలోకి వెళ్లి వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి వసతులను పరిశీలించారు. సోలార్ ఫిట్, ఊట చెరువుల్లో సంవృద్ధిగా నీటి నిల్వలు ఉన్నాయన్నారు. సాసర్ ఫిట్‌లలో నీళ్లు లేకపోతే ట్యాంకర్లతో తీసుకెళ్లి నింపనున్నట్లు తెలిపారు. డీఆర్ఓ లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్ఓలు బేగ్, శ్రీలత,ఎఫ్‌బీఓ ప్రణయ్, బేస్ క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులకు అండగా ప్రేమ్‌సాగర్‌రావు'



పీఎస్సార్ చిత్రపటానికి జలాభిషేకం

దండేపల్లి: రైతులకు ఇబ్బందులు కలుగకుండా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అండగా నిలిచి ఆదుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు, రైతులు అన్నారు. మండలంలోని తానిమడుగు సమీపంలో గూడెం ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద కడెం ప్రధాన కాల్వలో పలువురు రైతులు, కాంగ్రెస్ నాయకులు ప్రేంసాగర్‌రావు చిత్రపటానికి గురువారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కడెం ఆయకట్టు కింద యాసంగిలో డీ–30నుంచి డీ–42 వరకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల ద్వారా జనవరి 6నుంచి ఏప్రిల్ 3వరకు నిరంతరాయంగా సాగునీరు అందించారని తెలిపారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువ ఉన్నా రైతులు నష్టపోకుండా ఉండేందుకు నీరందిస్తున్నారని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల పోస్టుకార్డులు



పోస్టుకార్డులు చూపిస్తున్న రైతులు

చెన్నూర్: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని, రైతు భరోసా ద్వారా రూ.10 వేలు కాకుండా రూ.15 వేలు ఇవ్వాలని తెలిపారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ వెంటనే చేయాలని, రైతు కూలీలకు రూ.12 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. రైతులు పోస్టుకార్డుల ఉద్యమానికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల దామోదర్ రెడ్డి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు బుర్ర రాకేశ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

బస్సును వెంబడించి ఎక్కించారు..



బస్సులో ఎక్కించిన హోంగార్డు నీలయ్య

జన్నారం: హైదరాబాద్‌లో శిక్షణకు వెళ్తున్న నిరుద్యోగి జన్నారం బస్టాండ్‌లో బస్సు తప్పిపోగా బ్లూకోల్ట్స్ సిబ్బంది మోటార్‌సైకిల్‌పై వెంబడించి ఎక్కించారు. వివరాలిలా ఉన్నాయి. ఉట్నూర్‌కు చెందిన సీహెచ్.పృథ్వీరాజ్ శిక్షణ కోసం బుధవారం రాత్రి చివరి బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. జన్నారం బస్టాండ్‌లో రాత్రి 11 గంటలకు బస్సు ఆగడంతో మూత్రవిసర్జనకు వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును అక్కడి నుంచి హైదరాబాద్ వైపు పోనిచ్చాడు. బస్సు వెళ్లిపోవడంతో పృథ్వీరాజ్ ఆందోళనకు గురయ్యాడు. అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు నీలయ్య తమ మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని బస్సును వెంబడించారు. పది కిలోమీటర్ల దూరం వెళ్లాక చింతగూడ గ్రామ సమీపంలో బస్సును ఆపి అందులో ఎక్కించారు. పృథ్వీరాజ్ లగేజీ, బట్టలు, పుస్తకాలు అన్ని బస్సులోనే ఉన్నాయి. సమయానికి సహాయం అందించిన వారిని ప్రయాణికులు అభినందించారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి



మధుకర్(ఫైల్)

మంచిర్యాలక్రైం: వడదెబ్బతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతిచెందారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎక్బాల్ హైమద్ నగర్‌కు చెందిన ఎస్‌కే.ఫరీద్ పాష(40) వడదెబ్బతో చనిపోయాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరీద్ పాష ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అధికంగా మద్యం సేవించి అనారోగ్యానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఫరీద్ మధ్యాహ్నం స్థానిక ఎస్‌బీఐ ఎదుట పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఫరీద్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కౌటాల మండలంలో..

కౌటాల: కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ పరిధి జనగాం గ్రామానికి చెందిన వేలాది మధుకర్(24) వడదెబ్బ తగిలి బుధవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుకర్‌కు చెందిన ఎద్దు ఈ నెల 14న తప్పిపోయింది. జాడ వెతికేందుకు మధుకర్ గత మూడు రోజులుగా ఎండలోనే సమీప గ్రామాలు, వ్యవసాయ చేనుల్లో తిరిగాడు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద మధుకర్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా బుధవారం రాత్రి మార్గమధ్యంలో మృతిచెందాడు. మధుకర్‌కు తల్లిదండ్రులు కమలాబాయి, ధర్మరావు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రామారావును గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డితోపాటు అన్ని డివిజన్ల ముఖ్య నేతలు ఆయనను కలిసి సింగరేణిలో యూనియన్ బలోపేతం, కార్మికుల సమస్యలపై చర్చించారు. టీబీజీకేఎస్ యూనియన్ ఇక నుంచి బీఆర్ఎస్‌కు అనుబంధంగా కొనసాగుతుందని తెలిపారు. సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టామని, కార్మికుల్లో యూనియన్‌కు బలమైన ముద్ర ఉందని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. ఈ భేటీలో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, నాయకులు నూనె కొయిరయ్య, పెట్టం లక్ష్మణ్, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేశ్‌రెడ్డి, పొగాకు రమేశ్ పాల్గొన్నారు.

స్వంత గూటికి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి తిరిగి స్వంత గూటికి చేరనున్నారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల ముందు టీబీజీకేఎస్‌ను వీడి ఐఎన్టీయూసీలో చేరారు. ఆ యూనియన్‌లో సరైన గుర్తింపు లేకపోవడం, టీబీజీకేఎస్ నుంచి ఆహ్వానం రావడంతో శుక్రవారం తిరిగి టీబీజీకేఎస్‌లో చేరనున్నారు. పెద్దపల్లిలో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లికి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి టీబీజీకేఎస్ కండువా కప్పుకోనున్నారు.

ఐఎన్టీయూసీ సభ్యత్వ నమోదు



ఎస్సార్పీ 3 గనిలో సభ్యత్వ నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ 3 గనిలో ఐఎన్టీయూసీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ కార్మికులకు ఐఎన్టీయూసీ అనేక హక్కులు సాధించిన చరిత్ర ఉందన్నారు. ఈ నెల 21న గోదావరిఖనిలో సెంట్రల్ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్కే 7 గనిలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, గరిగే స్వామి, ఫిట్ సెక్రెటరీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎస్సార్పీ 3 గనిలో యూనియన్ బ్రాంచీ కార్యదర్శి ఫిట్స్ సెక్రెటరీలు శ్రీను, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

23 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 23నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరం సర్టిఫికేట్ కాలపరిమితి ముగిసిన, రెన్యువల్, నూతనంగా సర్టిఫికేట్ కోసం మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో సదరం శిబిరానికి హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 23న కంటి చూపు (30), 24న శారీరక దివ్యాంగులు–ఆర్థో(50), 25న మానసిక దివ్యాంగులు(50), 26న మూగ, చెవుడు (50) బాధితులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 20న ఉదయం 8 గంటలకు స్లాట్ ఓపెన్ చేస్తారని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటో బోల్తా..ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని అప్పపల్లి గ్రామానికి చెందిన ఆటో ఆసిఫాబాద్ నుంచి అప్పపల్లికి వెళ్తుండగా బూర్గుడ సమీపంలో అడ్డువచ్చిన ఎద్దును ఢీకొని ఆటో బోల్తా పడింది. చునర్కర్ విక్రుకు గాయాలు కాగా 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

21న ఐఎన్టీయూసీ మహాసభ

మందమర్రిరూరల్: ఈ నెల 21న గోదావరిఖనిలో నిర్వహించే ఐఎన్టీయూసీ మహాసభను సింగరేణి కార్మికవర్గం విజయవంతం చేయాలని ఆ సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య కోరారు. గురువారం ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలి పారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ మందమర్రి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, లక్ష్మణ్ తిరుపతి, రాజన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌కు చెందిన జేసీఐ మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆరుముల్ల రాజు బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్, పబ్లిక్ రిలేషన్స్, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్నందుకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ చైర్మన్ బూస ప్రదీప్, కోఆర్డినేటర్ దేవిలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఈ అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

నేడు కార్యదర్శుల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్‌పై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పంచాయతీ ప్రణాళిక, క్షేత్ర సహాయకులతో తయారు చేసిన అభివృద్ధి పనుల నివేదిక, గ్రామసభలు నిర్వహించి పనులు ఆమోదించడం, జాబ్‌కార్డుల అప్‌గ్రేడ్, కొత్త జాబ్ కార్డు కోసం దరఖాస్తులు తీసుకోవడం, ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా చైతన్యం చేయ డం, ఏడు రిజిష్టర్ల నిర్వహణ, వారాంతపు స మావేశాల నిర్వహణ తదితర వాటిపై పూర్తి స్థాయి సమీక్ష ఉంటుందని తెలిపారు. సమావేశానికి కార్యదర్శులు తాజా నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

మంచిర్యాలక్రైం: ఈ నెల 16న స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు బస్టాండ్‌లో పరిశీలించగా వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చారు. పత్రిక ప్రకటనల ఆధారంగా మృతుడి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించారు. మృతుడిని పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్‌గా గుర్తించారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. తన స్నేహితుడిని కలిసేందుకు మంచిర్యాలకు వచ్చి బస్టాండ్‌లో చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.